తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ శుక్రవారం 17 - 04 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 3

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి



- యాదాద్రి అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు
- ఆలేరులో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై సమీక్షా సమావేశం

ప్రజావారధి/ఆలేరు

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని యాదాద్రి అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. ఆలేరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరా కాంతి పథకం, పింఛన్లు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో నిజమైన లబ్ధిదారులు నష్టపోకుండా చూడాలని, గ్రామ స్థాయిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటిస్తూ లక్ష్యాలను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రగతి ప్రణాళిక అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ప్రజల సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ఆలేరు మండలంలో వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెవిన్యూ, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, పోలీస్‌శాఖలపై ప్రత్యేకంగా సమీక్షించారు. మండల ప్రత్యేక అధికారి పి.వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయ జిల్లా అధికారి వెంకటరామిరెడ్డి, ఆలేరు ఎస్‌హెచ్‌వో యాలాద్రి, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, డీఎంహెచ్‌వో మనోహర్, ఈజీఎస్ టెక్నికల్ ఇంజనీరింగ్ రామచంద్రయ్య చారి, ఏపిఎం సత్యనారాయణ, ఏవో శ్రీనివాస్, మండల పశు వైద్యాధికారి చైతన్య, పంచాయతీరాజ్ ఏఈ నవ్య, మిషన్ భగీరథ ఏఈ సుప్రియ, మండల పంచాయతీ అధికారి అనురాధ దేవి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు ఆరోగ్య భరోసా

## యాదాద్రి డీఎంహెచ్‌వో మనోహర్



ప్రజావారధి/ఆలేరు

చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కార్మికులకు ఉచిత వైద్యం కోసం ఆరోగ్య భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నామని యాదాద్రి డీఎంహెచ్‌వో మనోహర్ అన్నారు. ఆలేరు గౌడ సంఘం ఆవరణలో చేనేత కార్మికుల కోసం నిర్వహించిన ఆరోగ్య భరోసా శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేతను నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులు ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, అలాంటి వారికి ఆరోగ్య భరోసా ద్వారా అన్ని రకాల వైద్య సేవలు అందుతాయన్నారు. కార్మికులకు హెల్త్‌కార్డులు అందించడంతో పాటు వారికి అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందిస్తామని, ఉచితంగా మందులు ఇస్తామని, కార్మికుల పూర్తి ఆరోగ్య వివరాలను హెల్త్‌కార్డులో నమోదు చేస్తారని తెలిపారు. కార్మికులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదరపు కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ చైర్మన్ బాలమణిభాస్కర్, డీఆర్‌డీఏ నాగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆంజనేయులు, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సారాజిపేట మెడికల్ ఆఫీసర్ హైమావతి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## రిబ్బన్ కటింగులేనా..

# వడ్లు కొనేది లేదా..?

- ఎమ్మెల్యే కేంద్రాలను ప్రారంభించి వారం అవుతున్నా బస్తా ధాన్యం కొనలేదు
- రైస్‌మిల్లులను, లారీలను మాట్లాడలేదు
- రైతులు నష్టపోకుండా వెంటనే ధాన్యం కొనాలి

### మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి



ప్రజావారధి/మోత్కూరు

ధాన్యం కొనుగోలు కేంద్రాల రిబ్బన్ కటింగులు చేసి ధాన్యం మాత్రం కొనడం లేదని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ధాన్యం కొనుగోలు కేంద్రాల రిబ్బన్లు కటింగ్ చేసి వారం రోజులవుతున్నా నేటికీ కేంద్రాల్లో బస్తా ధాన్యం కొనలేదన్నారు. రిబ్బన్ కటింగులు చేసేందుకు చూపించిన ఆరాటాన్ని కొనుగోలు చేయడంలో ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. రైతుల ధాన్యం కొనడంలో జాప్యం జరుగుతుండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం రైస్ మిల్లులను, లారీలను అలాట్ చేయలేదని, మిల్లులను, లారీలను కేటాయించకుండానే కొనుగోలు కేంద్రాల రిబ్బన్లు కటింగ్ చేసి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనకపోవడంతో పడిగాపులు పడలేక చేసిన అప్పులు తీర్చేందుకు రైతులు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నారని, క్వింటాలుకు సుమారు రూ.500 వరకు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలును ప్రారంభించాలని, సకాలంలో డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ బీసీ విభాగం మండల అధ్యక్షుడు పానుగుల విష్ణుమూర్తి, 6వ వార్డు అధ్యక్షుడు కొణతం మహేందర్‌రెడ్డి, రైతులు కొణతం జాన్‌రెడ్డి, గజ్జి మల్లేష్, బద్దం సంజీవరెడ్డి ఆయన వెంట ఉన్నారు.